క్లుప్తంగా

దత్తపీఠం స్వామీజీకి స్వాగతం

సామర్లకోట: శృంగవృక్షంలోని దత్త పీఠాధిపతి సాయిదత్త నాగానంద సరస్వతి మహారాజ్‌కు మండలంలోని పీబీదేవంలోని భక్తులు శనివారం ఘనస్వాగతం పలికారు. పిఠాపురానికి పాదయాత్రగా వెళ్తున్న ఆయనకు శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి సభ్యులు, వివేకానంద సేవా సమితి సభ్యులు, వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. స్వామీజీ మాట్లాడుతూ హిందూ తత్వంలో మార్పులు రావడంతో హిందువులలో చైతన్యం తీసుకువచ్చేందుకు ఈ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. స్వామీజీ వెంట రేపాక ప్రసాద్, వెంకట సత్యనారాయణదీప్‌తో పాటు 17 మంది శిష్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా గ్రామోత్సవం



బాబా ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న బాలికలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శిరిడీ సాయిబాబా పల్లకి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ డి.అప్పారావు, జి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమెళ్ల భవాని ఆధ్వర్యంలో బాలికలు చేసిన కోలాటం అలరించింది. ఆలయ ఆంధ్రా సాయి గీతా సమాజం ఆధ్వర్యంలో పల్లకి గ్రామోత్సవం, భక్తి శ్రద్ధలతో బాణసంచా కాల్పులతో, బ్యాండ్ మేళాల మధ్య సాగింది. కమిటీ సభ్యులు కొప్పన రాంబాబు, సేపేని సూరిబాబు, పెదిరెడ్డి సూర్యనారాయణ, గండ్రేటి వెంకట రమణ, పోతాబత్తుల సత్యనారాయణలు భక్తులకు సేవలందించారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంలో భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.

ఘనంగా లలితా సహస్ర నామ పారాయణ



విష్ణు, లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న మహిళా భక్తులు

పిఠాపురం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం మహిళా భక్తులు విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. ఉండ్రాజవరం మండలం వాడ్లూరు గ్రామానికి చెందిన శ్రీసాయి దత్త భజన మండలి మహిళా సేవా సంఘం సభ్యులు పారాయణ చేసి అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఆలయ అర్చకులు విజయ జనార్దనాచార్యులు వారికి ఆలయ విశిష్టతను వివరించారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణకు సర్వే



కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: కుష్ఠు వ్యాధి నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని వైద్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు. గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం గొల్లప్రోలు మండలం కొడవలిలో కుష్ఠు వ్యాధి నిర్ధారణకు సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే వైద్య సేవలందించడం ద్వారా కుష్ఠు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటామని వైద్య సిబ్బంది తెలిపారు. సకాలంలో వ్యాధి నిర్ధారణ చేయడం వల్ల పూర్తిస్థాయిలో వైద్య సేవలు అంది వ్యాధి తగ్గే అవకాశం ఉందన్నారు. కుష్ఠు వ్యాధి నివారణలో భాగంగా ఇంటింటా సర్వే చేసి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

సామర్లకోట: గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక వాసవీ కన్యాకా పరమేశ్వరీ సత్రంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు సుమిత్‌కుమార్ జైన్, అమిత్‌కుమార్ జైన్ తెలిపారు. తమ తండ్రి భవర్‌లాల్ డి జైన్ 18 ఏళ్ల క్రితం ప్రారంభించిన వైద్య శిబిరాన్ని తాము కొనసాగిస్తున్నట్టు వారు తెలిపారు. సామర్లకోటలో స్థిరపడిన మర్వాడీల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

గెస్ట్ టీచర్ అభ్యర్థులకు 23న ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గెస్ట్ టీచర్ ఖాళీల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీ మంగళవారం పి.వెంకటాపురం గురుకుల పాఠశాలకు అన్ని ఒరిజల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ జిల్లా సమన్వయ కర్త జి.వెంకటరావు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

వానొచ్చినా మెట్టెక్కనీరు



మట్టి బెడ్డలతో పూడుకుపోయిన ఎర్రంపాలెం పుష్కర ఎత్తిపోతల కాలువ

- పుష్కరలో సాంకేతిక లోపంతో సాగని ఎత్తిపోతలు
- నీరు అందక మెట్ట రైతుల దిగాలు
- ఆలస్యమైతే నారు ముదిరే ప్రమాదం

పెద్దాపురం: మండల పరిధిలోని ఐదు గ్రామాలకు పుష్కర ఎత్తిపోతల సాగునీటి గండంతో మెట్ట రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో ముమ్మరంగా వరినాట్లు సాగుతున్నా మెట్టలోని ఆర్‌బీపట్నం, వాలు తిమ్మాపురం, కొండపల్లి, ఆర్‌బి కొత్తూరు, చినబ్రహ్మదేవం గ్రామాల రైతులకు నీటి ఎద్దడి తప్పడం లేదు. ఆయకట్టు భూములు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నాయి. పెద్దాపురం-2 అని పిలిచే ఎర్రంపాలెం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఐదు గ్రామాలతో పాటు రంగంపేట మండలం మర్రిపూడి గ్రామంతో కలిపి సుమారు ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది.



పంట కాలువ వద్ద అడ్డుకట్ట వేస్తున్న మెట్ట రైతులు (ఫైల్)

అయితే వివిధ సాంకేతిక కారణాల వల్ల ఎర్రంపాలెం ఎత్తిపోతల పథకం ద్వారా నీటి తోడకం ప్రారంభం కాలేదు. ఎన్నికల కోడ్ వల్ల సాగునీటి ముందస్తు పనులు మందగించాయి. ఈ వారంలో నీటి తోడకం ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లోగానే వరి నారు ముదురుపోయే ప్రమాదం ఉందని మెట్ట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన స్థితిలో పంట కాలువ..

ఇదిలా ఉండగా వాలు తిమ్మాపురం నుంచి కొండపల్లి వరకు వెళ్లే తొమ్మిది కిలో మీటర్ల పంట కాలువ అధ్వాన్నంగా ఉంది. పిచ్చి మొక్కలతో నీరు ముందుకు కదలకుండా రెల్లుగడ్డి, తూడుకర్ర పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. అక్కడక్కడ చిన్నపాటి మట్టి గెడ్డలు అండలు అండలుగా జారి పడ్డాయి. ఈ కాలువ గట్టున సూరంపాలెం మెట్ట మీద ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో మరో కొత్త సమస్య ఏర్పడింది. కొండవాలున ఇళ్ల స్థలాలకు భూమిని చదును చేయడంతో పెద్ద ఎత్తున వర్షపు నీరు మట్టితో కొట్టుకొచ్చి కాలువ పూడుకుపోయింది. ఈ ప్రాంతంలో రక్షణ కోసం అడ్డుగోడ కట్టాల్సి ఉంది. నిధుల కొరత వల్ల ఆ పనులు నిలిచిపోయాయి. గత మూడేళ్లుగా రైతులు తాత్కాలికంగా అడ్డుకట్టలు వేసినా ఈ ఏడాది అడ్డకట్ట వేసేందుకు రైతులు ముందుకు రాలేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతులు పుట్టా సోమన్న చౌదరి, సాల్మన్‌రాజు, కంటిపూడి విష్ణు తదితరులు కోరుతున్నారు.

శాశ్వత చర్యలు చేపట్టాలి



మెట్ట గ్రామాలైన ఈ ఆరు గ్రామాల రైతులకు పుష్కర ఎర్రంపాలెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరందించేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలి. గతంలో పలు మార్లు తాత్కలిక అడ్డుకట్టలు వేసినప్పటికీ అవి నిలబడలేదు. నిధుల కొరతతో ఆగిపోయిన కాలువ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి శాశ్వతం నీరు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. – **పుట్టా సోమన్న చౌదరి,** రైతు, మర్రిపూడి, రంగంపేట మండలం

కన్నీరు పెట్టిస్తున్న తూటేరు



గుర్రపు డెక్కతో నిండిన తూటేరు డ్రైను

- వీకే రాయపురంలో నీట మునిగిన పొలాలు
- నీరుపోయే మార్గం లేదని రైతుల ఆవేదన

సామర్లకోట: మండల పరిధిలోని వీకే రాయపురంలో పొలాలు వాననీటిలో మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి నీరు వేట్లపాలెం వద్ద సర్ఫస్ వియర్ గేట్ల నుంచి ఇక్కడి పొలాలను ముంచెత్తడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ నీరు పోలాల నుంచి తూటేరు డ్రైను మీదుగా సముద్రంలోనికి వెళ్లాల్సి ఉంది. కాగా ఆ డ్రైను పూర్తిగా పూడుకుపోవడంతో నీరు వెనక్కు తన్ని అన్నదాతకు తీవ్ర నష్టం చేస్తోంది. పొలాల్లో నిండిన నీటిని త్వరగా బయటకు పంపి పంటలను కాపాడుకోవాలని సూచిస్తున్న వ్యవసాయాధికారులు ఈ తూటేరు డ్రైన్ పూడికపై నోరెత్తడం లేదని తలారి దొరబాబు, వెలమర్తి బుల్లిరాజు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసులు తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నీరు సామర్లకోట మీదుగా సముద్రంలోకి పోయేలా చర్యలు తీసుకుని వీకే రాయపురం రైతు ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ సమస్యకు తూటేరు డ్రైనులో పూడిక పూర్తిగా తీయడం ఒక్కటే మార్గమని, అప్పటి వరకు వీకే రాయపురం రైతులకు ముంపు తప్పదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని ఏఓ ఐ.సత్య తెలిపారు. కాగా వీకే రాయపురం-మాధవపట్నం మధ్యలో 216 జాతీయ రహదారి వంతెన నిర్మాణ పనులతో గోదావరి కాలువను మూసి వేయడం వల్ల మామిళ్లదొడ్డికి చెందిన పంట భూములు నీటిలో మునిగి పాతున్నాయని, అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొలాలను పరిశీలించిన ఏఓ

మండల పరిధిలో నీట మునిగిన పొలాలను ఏఓ ఐ.సత్య శనివారం సాయంత్రం పరిశీలించారు. వేట్లపాలెం, వీకే రాయపురంలో పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆమె వెంట ఏఈఓ ఎంవీ సతీష్, వీఏఏలు పాల్గొన్నారు.

ముంపు నివారణకు జాగ్రత్తలు పాటించాలి



లక్ష్మీపురంలో పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పిఠాపురం: అధిక వర్షాలకు ముంపు బారిన పడిన పంటలు దెబ్బతినకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన వరి పొలాలను శనివారం మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. పంట నష్టపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. గొల్లప్రోలు మండలంలో గత రెండు రోజులుగా కురిసిన అధిక వర్షాలకు చేబ్రోలు శివారు లక్ష్మీపురంలో వెదజల్లిన 50 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తదుపరి 10 కేజీల యూరియా, 15 కేజీలు పొటాష్ పంటలకు వేయాలన్నారు. నీరు తొలగిన తర్వాత అవసరమైతే హెక్సాకోనజల్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరాకు 100 లీటర్ల మందు పిచ్చికారీ చేసుకోవాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాలను నివారించుకోవచ్చన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించడం ద్వారా రైతులు నష్టాలను నివారించవచ్చని తెలిపారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రతి రైతు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆయన వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

టిడ్కో కాలనీ అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: టిడ్కో కాలనీల్లో పరిశుభ్రత బాధ్యత అక్కడి లబ్ధిదారులపై ఉందని, పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక వాలుతిమ్మాపురం రోడ్డులో టిడ్కో గృహ సముదాయంలో శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు అధ్యక్షతన లబ్దిదారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో కాలనీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు గృహ రుణం పేరుతో బ్యాంకర్ల ఒత్తిడి ఉందని, సమస్య పరిష్కరించాలని కోరడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ గృహ లబ్ధిదారుల రుణ మాఫీపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీ వాసుల సమస్యలపై చర్చించారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మాజీ చైర్మన్ సూరిబాబు రాజు, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదు రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీనీ సత్వరం పరిష్కరించాలి

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అందిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 రోజులలో వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డ్రైన్లు, కాలువల్లో పూడిక తొలగింపు శ్మశాన వాటికకు స్థలం మంజూరు తదితర అంశాలకు సంబంధించి ఎక్కువగా ఉన్నాయన్నారు. పింఛన్ల పెంపు దరఖాస్తులను తిరస్కరించవద్దని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ సమావేశం ప్రతి శనివారం జరుగుతుందన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అంశాలపై జేసీ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. డంపింగ్ యార్డు, పరిశ్రమలు, శ్మశాన వాటికలకు అవసరమైన భూమి, గుర్తింపు, సేకరణ, మ్యూటేషన్, కుల ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్సీ కార్డుల మంజూరు, పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకుల పంపిణీ వంటి అంశాలపై కలెక్టర్ వారితో సమీక్షించారు. ప్రతి అంశంపైన ప్రత్యేక దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిర్దిష్టమైన కారణాలు లేకుండా దరఖాస్తులు తిరస్కరించవద్దని కలెక్టర్ వారికి సూచించారు.



హోరు వాన

ఉప్పువారి సత్రం వద్ద పొంగి ప్రవహిస్తున్న ఏలేరు కాలువ

- పల్లపు ప్రాంతాలు జలమయం

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మండలవ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల నుంచి భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రైన్లను ఆక్రమించి షాపులను ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు పోయేందుకు మార్గంలేక సుమారు మోకాలెత్తు నీరు నిలిచిపోయింది. వాకతిప్ప పోలీస్ స్టేషన్ ఎదురుగా, కొండెవరం, ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కుతుకుడుమిల్లి, కొత్తపల్లిలో డ్రైన్లు సక్రమంగా లాగకపోవడంతో రోడ్లపై గంటల తరబడి వర్షంనీరు నిలిచిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తీరప్రాంతంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి.



ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు

పొంగి ప్రవహిస్తున్న ఏలేరు కాలువ

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏలేరు కాలువ పొంగి ప్రవహిస్తుంది. స్థానిక పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం వద్ద ఉన్న ఏలేరు కాలువ నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నీరు ఐదు తూముల మీదుగా వీకే రాయపురం నుంచి సముద్రంలోనికి కలుస్తుంది. ఉప్పువారి సత్రం వద్ద ఉన్న ఏలేరు గేట్ల నుంచి గొంచాల, చంద్రంపాలెం, నవరకు ఏలేరు నీరు వెళుతుంది. అనేక ప్రాంతాల్లోని చెరువులు నిండిపోవడంతో చేపల వేట సాగిస్తున్నారు.

జూనియర్ ఇండియా కబడ్డీ పోటీలకు మనోహర్



మనోహర్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

పెద్దాపురం: తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపి జూనియర్ ఇండియా ప్రోబబుల్స్ జట్టుకు ఆంధ్రప్రదేశ్ నుంచి మండలంలోని దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె.మనోహర్ ఎంపికయ్యాడు. శనివారం కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో సీఎస్ఈ మూడో సంవత్సరం విద్యార్థి మనోహర్ కర్నూలులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి జూనియర్ ఇండియా కబడ్డీ ప్రోబబుల్స్‌కు ఆంధ్రప్రదేశ్ తరుపున ఎంపికైె నట్లు యాజమాన్యం ఆ ప్రకటనలో పేర్కొంది. మనోహర్‌ను కళాశాల చైర్మన్ బేతిసీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సర్వరామేశ్వరుడు, ఈఓ జెన్నిబాబు తదితరులు అభినందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



వాకతిప్పలో షార్ట్ సర్క్యూట్‌కు గురవుతున్న విద్యుత్ స్తంభం



వాకతిప్ప శెట్టిబలిజపేటలో టెలిఫోన్ స్తంభానికి కట్టిన విద్యుత్ వైర్లు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామంలో పలు చోట్ల విద్యుత్ సభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం పడితే చాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్ కో సిబ్బంది విద్యుత్ వైర్లను టెలిఫోన్ స్తంభాలు, ఇరిగిన స్తంభాలను బిగించారు. పలు ప్రాంతాల్లో చెట్లు విద్యుత్ వైర్లకు ఆనుకుని ఉండడంతో వర్షం పడితే మంటలు వ్యాపిస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడుతున్నాయి. గ్రామంలోని విద్యుత్ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

23 నుంచి ఆధార్ శిబిరాలు

సామర్లకోట: మండల పరిధిలో ఈనెల 23 నుంచి 27 వరకు ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న పి. వేమవరం, అచ్చంపేట, జి.మేడపాడు పంచాయతీ కార్యాలయాల వద్ద, 24న నవర, గొంచాల, పీబీ దేవం, 25న చంద్రంపాలెం, వీకే రాయపురం, మాధవపట్నం-2, వేట్లపాలెం-2 సచివాలయాల వద్ద శిబిరం ఉంటుందన్నారు. అలాగే 26న పవర, వేట్లపాలెం-4 సచివాలయం వద్ద, 27న ఉండూరు-2 సచివాలయం, పనసపాడు, వేట్లపాలెం-1 సచివాలయాల వద్ద ఆధార్ శిబిరాలు ఉంటాయన్నారు.

ప్రజలు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి

- వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు
- కమిషనర్ వెంకటరావు
- పలు ప్రాంతాలలో పర్యటన

కాకినాడ: వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. వర్షాల నేపథ్యంలో శనివారం ఆయన కొత్తపేట మార్కెట్, ఫౌండేషన్ హాస్పిటల్ రోడ్డు, ఎస్ఎఫ్‌సిఎల్ రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. వర్షపు నీరు నిలువ లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైన్లలో నీరు స్తంభించిపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. బొందగుంటలోని వెహికల్ యార్డ్ ప్రాంతాన్ని ఆయన సందర్శించి అనంతరం మాట్లాడుతూ ఎక్కడైనా ముంపు సమస్య ఉంటే సత్వరమే పరిష్కరించేలా సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా ఒకటి రెండు రోజుల పాటు వర్షాల ప్రభావం ఉండే అవకాశం ఉందని, ప్రజలు కూడా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడిగా ఉండే ఆహారాన్ని తినడం, పరిసరాల పరిశుభ్రత, బయట నుంచి మాంసాహారాన్ని తీసుకోకుండా దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే డయేరియా వంటి సమస్యల బారిన పడకుండా ఉండవచ్చునన్నారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్ తదితరులున్నారు.



మార్కెట్ ప్రాంతంలో సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు

కొత్తపల్లి: డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి భాస్కరరావు సూచించారు. మండలంలో పొన్నాడ శివారు కోనాపాపపేటలో శనివారం నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 264 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు మురుగు, వర్షపు నీటి నిల్వల్లో పెరుగుతాయన్నారు. దోమల నివారణకు ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల మధ్య, గోళాలు, డ్రమ్ములు, వాటర్ ట్యాంకులు, సంపులు, ఫ్లవర్ వేజ్‌లు, రుబ్బురోళ్లు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిపై దోమలు వాలి ఒక్కో దోమ సుమారు 200 వరకు గుడ్లు పెడుతుందన్నారు. ఈ గుడ్లన్నీ వారం నుంచి 10 రోజుల్లో దోమలుగా వృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కోనపాపపేట వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు